క్లుప్తంగా

గోవా సీఎంను కలిసిన ఎంపీ రఘునందన్


సీఎం ప్రమోద్ సావంత్‌తో రఘునందన్‌రావు

దుబ్బాక: మెదక్ ఎంపీగా నామినేషన్ వేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గోవా సీఎంను శనివారం ఢిల్లీలో ఎంపీ రఘునందన్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీగా గెలుపొందినందుకు సీఎం ప్రమోద్ సావంత్ తనను ప్రత్యేకంగా అభినందించారని రఘునందన్‌రావు సాక్షికి ఫోన్‌లో తెలిపారు.

ఆలయాల భూముల పరిశీలన


ఆలయ భూములను పరిశీలిస్తున్న సిబ్బంది

కొమురవెల్లి(సిద్దిపేట): సంగారెడ్డి అసిస్టెంట్ కమిషనర్ దేవాదాయశాఖ ఆదేశాల మేరకు కొమురవెల్లి మల్లికార్జున ఆలయ సిబ్బంది సందీప్, శ్రీనివాస్ మండలంలోని పలు ఆలయాల భూములను పరిశీలించారు. శనివారం అయినాపూర్‌లోని మహాదేవ్ టెంపుల్, పోసాన్‌పల్లి రామలింగేశ్వర స్వామి ఆలయం, గురువన్నపేట రామలింగేశ్వర ఆలయ భూములు పరిశీలించి సమగ్ర నివేదికను రూపొందించారు. సంబంధిత నివేదికను ఉన్నత అధికారులకు సమర్పించనున్నట్లు సిబ్బంది తెలిపారు.

మూతపడిన పాఠశాలలను ప్రారంభిస్తాం : ఎంఈఓ


నిర్మల్ నగర్‌లో పిల్లలతో అధికారులు


జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని వివిధ గ్రామాల్లో మూత పడిన పాఠశాలలను ప్రారంభిస్తామని ఎంఈఓ ఉదయ్ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అలిరాజ్‌పేట, నిర్మల్ నగర్ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అలిరాజ్‌పేటలో నూతనంగా పాఠశాల భవనం నిర్మించారన్నారు. అలాగే నిర్మల్‌నగర్ గ్రామంలో భవనం ఉన్నప్పటికీ విద్యార్థులు రాకపోవడంతో పాఠశాల మూతపడిందన్నారు. ఈయేడు తప్పనిసరిగా పాఠశాలలను పునఃప్రారంభిస్తామన్నారు. అలాగే రాంనగర్ పాఠశాలను కూడా ప్రారంభిస్తామని తెలిపారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సైదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులోనే సురక్షిత ప్రయాణం


యాదగిరిగుట్ట బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న కనకలక్ష్మీ

దుబ్బాకటౌన్: ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం సురక్షితమని దుబ్బాక బస్ డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ కనకలక్ష్మీ అన్నారు. దుబ్బాక – యాదగిరి గుట్ట ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును శనివారం జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం యాదగిరిగుట్టకు నూతనంగా బస్సు సర్వీస్ ప్రారంభించామన్నారు. ప్రతీరోజూ ఉదయం 5 గంటలకు బస్సు దుబ్బాక నుంచి బయలుదేరి సిద్దిపేట, చేర్యాల మీదుగా యాదగిరి గుట్టకు చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంగువ బెల్లం పంపిణీ


ఇంగువ బెల్లంను పంపిణీ చేస్తున్న గౌస్‌బాబా

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మృగశిర కార్తె సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో పలువురు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సామాజిక కార్యకర్త గౌస్ బాబా సిద్దిపేట మోడల్ రైతుబజార్ ఆవరణలో ఇంగువ, బెల్లం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్, సిబ్బంది, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.

సాగుకు సమాయత్తం

మృగశిరతో ఆరుతడి పంటల సాగు ప్రారంభం

సకాలంలో రుతుపవనాలు రావడంతో రైతులు వానాకాలం పంటల సాగుకు సిద్ధమయ్యారు. ఎరువులు, విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. అలాగే పంటల సాగుకు పొలాలను సిద్ధం చేశారు. పత్తి, మొక్కజొన్న, వరి సాగు పనులు ప్రారంభించారు. మృగశిర కార్తె ప్రారంభం కావడంతో ఆరుతడి పంటల కోసం దుక్కిదున్నేందుకు సిద్ధమయ్యారు. పంటల సాగుకు కావల్సిన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచామని వ్యవసాయ అధికారులు తెలిపారు.

- పొలం పనుల్లో రైతన్నలు బిజీబిజీ
- విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్న రైతులు
- 40 శాతం కొనుగోలు చేశారన్న అధికారులు


పత్తి సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

మర్కూక్(గజ్వేల్): తొలకరి పలకరించడంతో రైతులు సాగు పనులకు సమాయత్తమయ్యారు. నాలుగు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు రైతన్నలు పొలం పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. సీజన్ ప్రారంభం నుంచే వర్షాలు కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. దుక్కి దున్ని పొలాలు సిద్ధం చేసుకున్న వర్షాలు కురియడంతో విత్తనాలు వేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న, వరి సాలు పనులు ప్రారంభమయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, మర్కూక్, ములుగు, వర్గల్, తూప్రాన్, జగదేవ్‌పూర్‌తో పాటు పలు ప్రాంతాలలో వర్షాలు కురుస్తుండటంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మృగశిర కార్తె ప్రారంభం కావడంతో రైతులు ఆరుతడి పంటల సాగుకు దుక్కి దున్నే అవకాశం లభించింది.

ఎరువులు, విత్తనాలు కొనుగోలు

వర్షాలు కురుస్తుండటంతో రైతన్నలు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. మర్కూక్ మండలంలో ఇప్పటికే 40 శాతం వరకు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. పత్తి, వరి, మొక్కజొన్న పంటలకు విత్తనాలు కొనుగోలు చేశారన్నారు. రైతులు దుక్కి దున్ని విత్తనాలను విత్తేందుకు సన్నద్ధమయ్యారు. పలు చోట్ల ఇప్పటికే పత్తి, మొక్కజొన్న విత్తనాలను విత్తారు.

అందుబాటులో విత్తనాలు



మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. వ్యవసాయ శాఖలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. మండలంలో రైతులకు 3,500 ఎకరాలకు కావాల్సిన పత్తి విత్తనాలు సిద్ధం చేశాం. అలాగే వరి విత్తనాలు 7,600 మొక్కజొన్న విత్తనాలు వెయ్యి ఎకరాలకు సరిపడా ఉన్నాయి. ఇప్పటికే రైతులు 40 శాతం విత్తనాలు కొనుగోలు చేశారు. ఈసారి కూడా రైతులు వరి, పత్తి, మొక్కజొన్న పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు.

– నాగేందర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి


లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి శివరంజని

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

జడ్జి శివరంజని

హుస్నాబాద్: రాజీ మార్గంలో చిన్నచిన్న కేసులు పరిష్కరించుకునేందుకు కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సివిల్ జూనియర్ జడ్జి శివరంజని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం కోర్టు ఆవరణలో రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు చిన్నచిన్న కేసుల్లో పంతాలకు పోయి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దన్నారు. ఎవరి ఒత్తిడి లేకుండా రాజీ కుదుర్చుకొని వస్తే కేసులను కొట్టివేస్తామన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులు అధికంగా వస్తున్నాయని, సాధారణ రోజుల్లో మద్యం తాగి పట్టుపడితే పోలీసులు రూ.10 వేల వరకు జరిమానా విధిస్తారని, లోక్ అదాలత్‌లో అతి తక్కువ జరిమానాతో అటువంటి కేసులను పరిష్కరించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ప్రతీ ఒక్కరూ విచక్షణతో ఆలోచించి ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీపీ నాగరాజు, ఏజీపీ కన్నోజు రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, లోక్ అదాలత్ మెంబర్ విజయలక్ష్మి, న్యాయవాదులు పాల్గొన్నారు.

2064 కేసుల పరిష్కారం


గజ్వేల్ కోర్టు ఆవరణలో మాట్లాడుతున్న జడ్జి ప్రియాంక

గజ్వేల్‌రూరల్: రాజీపడదగిన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని వేదికని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, గజ్వేల్ ప్రిన్సిపల్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా గజ్వేల్ కోర్టులో శనివారం మొత్తం 2064 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలతో కక్షలు పెంచుకోవద్దన్నారు. పరస్పరం కేసులు పెట్టుకోవడం వల్ల విలువైన కాలంతో పాటు డబ్బు వృథా అవుతుందన్నారు. లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొంది సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో పబ్లిక్, న్యాయవాదులు, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిన నర్సింహులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, మండల లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహాచారి, యామిని, కోర్టు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంను విమర్శిస్తే గుణపాఠం చెబుతాం


మాట్లాడుతున్న శెట్టిపల్లి సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): సీపీఎంను విమర్శిస్తే కాంగ్రెస్ నాయకులకు తగిన గుణపాఠం చెబుతామని ఆ పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి హెచ్చరించారు. శనివారం పార్టీ మండల కార్యాలయంలో తాడూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పదవిని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పర్వాటకం లక్ష్మారెడ్డికి రూ.25 లక్షలకు అమ్ముకున్నాడని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రతాప్‌రెడ్డి గతంలో చేర్యాలలో చేసిన ఒక వెంచర్‌లో అప్పటి పంచాయతీ ప్రస్తుత మున్సిపాలిటీకి మూడు ఎకరాలు ఇవ్వకుండా అమ్ముకున్నాడని విమర్శించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలయ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి నాలుగు నెలలు తన పదవిని అడ్డు పెట్టుకొని రూ.కోట్ల అవినీతికి పాల్పడ్డాడని, అతడి అండ చూసుకొని మరికొంత మంది భూముల కబ్జాకు పాల్పడ్డారన్నారు. భూ ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు చేపతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, శారద, ప్రశాంత్, ఇస్తారి, బాల కిషన్, నరేష్, భరత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు


సంబురాల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఘనవిజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. శనివారం కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు.

పాత బస్టాండ్ సమీపంలో..

చేర్యాల(సిద్దిపేట): నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న గెలుపొందడంతో శనివారం స్థానిక పాత బస్టాండ్ సమీపంలో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. తీన్మార్ మల్లన్నకు ఓటువేసిన పట్టభద్రులందరికీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చిరంజీవులు, నాయకులు ఆగంరెడ్డి, చంద్రయ్య, కిష్టయ్య, కౌన్సిలర్లు నరేందర్, లింగం, శ్రీకాంత్, మహిపాల్‌రెడ్డి, రాములు, ఖాజా, నాగరాజు, రమేష్, బాబు, వెంకటేశం, నర్సిరెడ్డి, బాలరాజు, జహీర్, అంజయ్య, శ్రీనివాస్, కేశవులు, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


చేర్యాలలో..

వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత


మహిళలకు కప్స్ అందజేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రజిత

హుస్నాబాద్: ప్రతీ మహిళ వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బాల వికాస ఆధ్వర్యంలో శనివారం మెనుస్ట్రాల్ కప్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్యాడ్స్ వాడటం వల్ల ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకోవడంతో పాటు వాతావరణ కాలుష్యం పెరగడానికి కారణమవుతుందన్నారు. మహిళలు నెలసరి సమయంలో మెనుస్ట్రాల్ కప్స్ ఉపయోగించాలని, తద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, బాల వికాస విడో ప్రోగ్రాం మేనేజర్ మంజుల, బాల వికాస ప్రతినిధులు జ్యోతి, నిర్మల, శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

జీవాలను అక్రమ రవాణా చేస్తే చర్యలు

సిద్దిపేటకమాన్: అనుమతి లేకుండా మూగ జీవాలను అక్రమంగా రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట సీపీ అనురాధ హెచ్చరించారు. జిల్లా సరిహద్దు గుండా పశువుల అక్రమ రవాణాను కట్టడి చేయడానికి జిల్లాలో ఆరు చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. అక్రమంగా పశువులు తరలిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం తెలియజేయాలన్నారు. రాబోవు బక్రీద్ సందర్భంగా అక్రమంగా పశువులను రవాణా చేసే అవకాశం ఉన్నందున, పోలీసులు, పశుసంవర్ధక శాఖ అధికారుల సమన్వయంతో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.

దొంగతనాలే వృత్తిగా..

- చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్
- 30 గ్రాముల బంగారం, 166 గ్రాముల వెండి స్వాధీనం


వివరాలను వెల్లడిస్తున్న ఎస్సై తాండ్ర వివేక్

అక్కన్నపేట(హుస్నాబాద్): గంజాయి, తాగుడుకు బానిసై దొంగతనాలే వృత్తిగా మార్చుకొని పలు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అక్కన్నపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శనివారం ఎస్సై తాండ్ర వివేక్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. యాదాద్రి జిల్లా మోత్కూర్ గ్రామం సిరిగిరి సాయిబాబ అలియాస్ సాయికుమార్, సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామం గంధం అర్జున్ ప్రస్తుతం కొండగట్టులో నివాసం ఉంటున్నాడు. వీరిద్దరూ స్నేహితులు. గంజాయి, తాగుడుకు బానిసై దాదాపుగా 20కి పైగా దొంగతనాలు చేసి జైలుకెళ్లారు. గత నెల 19వ తేదీన సైతం మండలంలోని అంతక్కపేట గ్రామ పరిధిలోని కట్కూర్ క్రాసింగ్ వద్ద అల్లాడి సమ్మక్క–కనకయ్య దంపతుల ఇంట్లో పట్ట పగలు చోరీకి పాల్పడ్డారు. సమ్మక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు విచారణ చేపట్టారు. శనివారం నిందితుడు సాయిబాబా భార్య పిల్లలతో కలిసి అంతక్కపేట గ్రామం మీదుగా వరంగల్ జిల్లా కర్నాపురం చర్చికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అంతక్కపేట క్రాసింగ్ వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా ఉండగా పట్టుకొని విచారించగా దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. అదే విధంగా ఇద్దరూ కలిసి మల్లంపల్లిలోని స్కూల్‌లో నల్లాల పైపులు, గంగాధర మండలం, వెంకటాయపల్లి స్టేజీ వద్ద బైక్‌ను దొంగిలించినట్లు పేర్కొన్నాడు. దీంతో ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 30 గ్రాముల బంగారం, 166 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసును ఛేదించడానికి సహకరించిన కానిస్టేబుల్స్ రాజ్‌కుమార్, హరీశ్, యాదగిరిలను అభినందించారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు


ఆయుధాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ అధికారులు

గజ్వేల్‌రూరల్: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గజ్వేల్ సీఐ సైదా, ట్రాఫిక్ సీఐ మురళి పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం క్యాడెట్లకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లకు స్పందించొద్దన్నారు. వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే ఆస్కారముందన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలగాలని, పాఠాలను శ్రద్ధగా వింటూ తాము ఎంచుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగాలన్నారు. ఉన్నత శిఖరాలు చేరుకున్నప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అదే విధంగా గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు రోగ నిరోధక గురించి వివరించారు. అనంతరం ఆయుధాల వినియోగంపై ఎన్‌సీసీ క్యాడెట్లకు అధికారులు అవగాహన కల్పించారు. అలాగే క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ కెప్టెన్ డాక్టర్ భవానీ, అధికారులు నరోత్తం, సంధ్యారాణి, సుబేదార్ మేజర్ రామ్‌హరి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుడికి గాయాలు


క్షతగాత్రునికి ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

దుబ్బాకటౌన్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వాహనదారుడు రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన దౌల్తాబాద్ మండలం మల్లేశంపల్లి గ్రామం స్టేజ్ వద్ద శనివారం జరిగింది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన గడ్డం ఆంజనేయులు (50) వ్యక్తిగత పని నిమిత్తం దౌల్తాబాద్‌కు వచ్చాడు. తిరిగి తిరుమలాపూర్ వెళ్తున్న క్రమంలో మల్లేశంపల్లి స్టేజ్ వద్ద వాహనం అదుపు తప్పి కిందపడటంతో ఆంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో వారి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి వెంటనే గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



● బెల్టు షాపుల బంద్ కోసం..

మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో బెల్టు షాపులు బంద్ చేయించాలని డిమాండ్ చేస్తూ గ్రామానికి చెందిన పలువురు మహిళలు శనివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో మద్యానికి బానిసైన కొందరు తాగిన మైకంలో కుటుంబ సభ్యులపై దాడులు చేస్తున్నారన్నారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందించామన్నారు.

– చేర్యాల(సిద్దిపేట)



● చేపల కోసం ..

మృగశిర కార్తె అనగానే గుర్తుకు వచ్చేది చేపలు. ఈ రోజు చేపలు ఆహారంగా తీసుకోవడం ఆనవాయితీ. కార్తె తొలిరోజు చేపలు తింటే ఆరోగ్యం బాగుటుందని, వ్యాధులు దరిచేరవని ప్రజల నమ్మకం. శనివారం గ్రామాల ఊర చెరువుల్లో జాలర్లు చేపలు పట్టి విక్రయించారు. వాటి కోసం జనం క్యూ కట్టారు. దుల్మిట్ట మండలం కుటిగల్ గ్రామంలో పెద్ద చెరువులో మత్స్యకారులు చేపలు పట్టి విక్రయించారు.

– మద్దూరు(హుస్నాబాద్)

విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి

ఓ వెంచర్‌లో మట్టి పోస్తుండగా ఘటన


వెంకటేశ్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తి జిల్లా వెల్టూర్ గ్రామానికి చెందిన జింకల వెంకటేశ్ (43) కొన్నేళ్లుగా టిప్పర్ డ్రైవరుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తిమ్మారెడ్డిపల్లిలోని ఓ వెంచర్‌లో టిప్పర్ సాయంతో మట్టిని పోస్తున్నాడు. మట్టిని ఆన్‌లోడ్ చేసి ట్రాలీని కిందకి దించకుండానే టిప్పర్‌ను ముందుకు తీసుకెళ్లాడు. దీంతో వెంచరులో ఉన్న విద్యుత్ తీగలు టిప్పర్‌కి తగిలి కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

బీజేపీలో పలువురు చేరిక

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని లెనిన్‌నగర్, కొమురవెల్లి గ్రామాలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. శనివారం పార్టీ మండల అధ్యక్షుడు బూర్గుజు నాగరాజు ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి సమక్షంలో సిద్దిపేటలో పలువురు నాయకులు పార్టీలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ జన్మదినోత్సవం సందర్భంగా ఎల్‌ఎండీలోగల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈనెల 10వ తేదీన రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. మండల నాయకులు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కవ్వంపెల్లి యువసేన అధ్యక్షుడు కత్తి రమేష్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.